# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **దేశ వ్యాప్తంగా రేపు చేపట్టనున్న మాక్ డ్రిల్స్ సన్నద్ధతపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈరోజు ఢిల్లీలో సమీక్ష నిర్వహించింది.**

**2.** **రాష్ట్రంలో 'టూరిజం ఫెస్టివల్ క్యాలెండర్' రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**3.** **పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

**4.** **ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మెరుగుదలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.**

**5.** **ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా ప్రభుత్వం నిరుపేదలకు భద్రత కల్పిస్తోందని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.**

==========================

రాష్ట్రంలో ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించేలా 'టూరిజం ఫెస్టివల్ క్యాలెండర్' రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. పర్యాటకశాఖపై సచివాలయంలో సమీక్ష సందర్భంగా ఈ రంగంలో వివిధ సంస్థలు పెట్టనున్న పెట్టుబడుల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 12 వేల 565 కోట్ల రూపాయల పెట్టుబడితో 8 వేల 73 గదుల సామర్థ్యం గల 69 హోటళ్లు, రిసార్టులు నెలకొల్పేందుకు వివిధ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. త్వరితగతిన అనుమతులు, రాయితీలు అందించి ప్రాజెక్టులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిస్థితుల నేపథ్యంలో రేపు దేశ వ్యాప్తంగా చేపట్టనున్న మాక్ డ్రిల్స్ సన్నద్ధతపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ రోజు ఢిల్లీలో కీలక సమీక్ష నిర్వహించింది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో ఈ సమీక్ష జరిగింది. దేశవ్యాప్తంగా సుమారు 244 జిల్లాల్లో మాక్ డ్రిల్స్‌కు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశ భద్రతలో పౌరుల్ని సమాయత్తం చేసేందుకు రేపు మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ సూచించింది. ఈ క్రమంలోనే ఈ రోజు నిర్వహించిన

సమీక్షకు సివిల్ డిఫెన్స్ డీజీ, ఎన్డీఆర్ఎఫ్ డీజీ సహా పలువురు ఉన్నతాధికారులు, దృశ్యమాధ్యమ విధానం ద్వారా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.

---------------------------

నేర నిరూపణకు అత్యంత కీలకమైన ఫోరెన్సిక్ ఆధారాల సేకరణలో కృత్రిమ మేధను వినియోగించనున్నామని శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ఫోరెన్సిక్ ప్రయోగశాల డైరెక్టర్ జి.పాలరాజు తెలిపారు. ఫోరెన్సిక్ ఆధారాల ప్రాముఖ్యత, వాటి సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రాష్ట్రవ్యాప్తంగా దర్యాప్తు అధికారులు, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఈ నెల 10వ తేదీ వరకూ నిర్వహించే శిక్షణ తరగతుల కార్యశాలను మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమ విధానం ద్వారా నిన్న వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దర్యాప్తు అధికారులు, ఆధారాల సేకరణ బృందాలకు ఉపయోగపడేలా వివిధ రకాల ఏఐ ఉపకరణాలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.

---------------------------

పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు వద్ద నిర్మిస్తున్న బట్రస్ డ్యాం, గ్యాప్-2 డి గోడ పనులను ఈ రోజు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిపుణుల కమిటీతో మంత్రి సమావేశం అయ్యారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని స్పష్టంచేశారు. రాష్ట్ర అభివృద్ధి ఈ ప్రాజెక్టుపైనే ఆధారపడి ఉందని రామానాయుడు అన్నారు.

---------------------------

రాష్ట్రంలోని మహిళా ఉద్యోగులు ప్రసూతి సెలవులు వినియోగించుకునేందుకు ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010 మే నెలలో మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు 120 రోజుల నుంచి 180 రోజులకు పెంచుతూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇద్దరు కన్నా తక్కువ పిల్లలు ఉన్నప్పుడు మాత్రమే ఈ సెలవులు వినియోగించుకోవాలనే నిబంధన ఉండేది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఆ నిబంధన తొలగించారు.

---------------------------

పని ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు మృతిచెందిన, పూర్తిగా దివ్యాంగులైన ఉపాధి శ్రామికులకు ఇప్పటివరకు ఇస్తున్న 50 వేల రూపాయల పరిహారాన్ని 2 లక్షల రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తల్లిదండ్రులతోపాటు పని ప్రదేశాలకు వచ్చిన ఆరేళ్లలోపు పిల్లలు ప్రమాదంలో శాశ్వతంగా దివ్యాంగులైతే అలాంటి వారికి ఇప్పటివరకు ఇచ్చే 25 వేల రూపాయల పరిహారాన్ని కూడా లక్ష రూపాయలకు పెంచారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మెరుగుదలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయంలో ఈరోజు ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి

మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. తాగు నీరు, సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారు.

---------------------------

సంవత్సరంలో ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించేలా ప్రభుత్వం వినూత్న కార్యాచరణను రూపొందిస్తోందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల సంతృప్తిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం సచివాలయంలో మంత్రి పార్థసారథి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రజల సంతృప్తే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. సంవత్సరానికి ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు-5 లక్షలు అనే కార్యాచరణను రూపొందించామని మంత్రి వివరిస్తూ..

.. వాయిస్.. 33 సెకన్లు....

---------------------------

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా ప్రభుత్వం నిరుపేదలకు భద్రత కల్పిస్తోందని మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని 6, 16, 18వ వార్డుల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగుల పింఛన్లను మూడు వేల నుంచి ఆరు వేల రూపాయలకు, వృద్ధులు, వితంతువులకు మూడు వేలు నుంచి నాలుగు వేల రూపాయలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పది వేల రూపాయలకు పెంచిందని తెలిపారు. అనంతరం మక్కువ మండలం గోపాలపురం గ్రామ దేవత పండుగలో సంధ్యారాణి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

---------------------------

ప్రపంచవ్యాప్తంగా ఉబ్బసం వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మే నెల మొదటి మంగళవారం ప్రపంచ ఉబ్బస అవగాహన దినాన్ని నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లలు, పెద్దలలో ఉబ్బసం అత్యంత తరచుగా వచ్చే దీర్ఘకాలిక వ్యాధి. తక్కువ, మధ్య-ఆదాయ దేశాలలో పేదరికం కారణంగా ఉబ్బసం వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ.. డబ్ల్యూహెచ్ఓ గుర్తించింది. ఆస్తమాపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ఏడాది ఇన్‌హేల్డ్ చికిత్సలు అందరికీ అందుబాటులో ఉంచండి అనే ఇతివృత్తంతో ప్రపంచ ఉబ్బస అవగాహన దినాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలో ఐటీ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలో యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఒరాకిల్‌తో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం చేసుకుంది. గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో నిన్న ఒరాకిల్, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ద్వారా ఎంపికచేసిన యువతకు ఒరాకిల్ యూనివర్సిటీ లెర్నింగ్ సబ్‌స్క్రిప్షన్ కంటెంట్ ఉచితంగా లభిస్తుంది.

====================